యాదగిరిగుట్టలో కార్తీక సందడి

ఆలయ క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, నవంబర్ 3 : యాదగిరీశుడి దివ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవుతో పాటు కార్తీక మాసం కావడంతో స్వయంభూ నారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మాడ వీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాడవీధులు, గర్భాలయ ముఖ మండపంలో భక్తుల సందడి నెలకొంది. కొండ కింద కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ధర్మ దర్శనానికి 2గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు పుష్పాలతో ఉత్సవమూర్తులను అర్చించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం వెండి మొక్కు జోడు, దర్బార్ సేవల్లో భక్తులు పాల్గొని తరించారు. పాత గుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీపారాధనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారిని సుమారు 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.60,82772 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారిని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వేర్వేరుగా దర్శించుకుని పూజలు నిర్వహించారు.

గుట్టలో మణవాళ మహాముని తిరునక్షత్రోత్సవం ప్రారంభం

యాదగిరిగుట్ట, నవంబర్ 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో మణవాళ మహాముని తిరునక్షత్రోత్సవ వేడుకలను అర్చకులు ఆదివారం ప్రారంభించారు. మొదటి రోజు స్వామివారిని ఆలయ ముఖ మండపంలో వేంచేపు చేసి సేవను ప్రారంభించారు.

దివ్య ప్రబంధ పఠనాలను పఠించి తొళక్కం నిర్వహించారు. మరో రెండు రోజులపాటు మణవాళ మహాముని తిరునక్షత్రోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

స్వర్ణగిరిలో కార్తీక మాస ప్రత్యేక పూజలు

స్వర్ణగిరి దేవాలయంలో ఏర్పాటు చేసిన వైకుంఠ నారాయణ మోక్ష దీపం

భువనగిరి అర్బన్, నవంబర్ 3 : స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం పూజలు, దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. కార్తీక మాసం సందర్భంగా దేవాలయంలోకి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 21 అడుగుల వైకుంఠ నారాయణ మోక్ష దీపాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అంబుజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రతిఘటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ పెంటయ్య

రామన్నపేట, నవంబర్ 3 : ప్రజలు ఐక్యంగా ఉండి అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రతిఘటించాలని పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కో కన్వీనర్ ఎండీ రేహాన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పర్యావరణ పరిరక్షణ వేదిక సమావేశంలో వారు మాట్లాడారు. అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే మహా ప్రజాపోరాటం తప్పదని హెచ్చరించారు. ప్రజాభిప్రాయ సేకరణ జరిగి 10రోజులు గడుస్తున్నా ప్రజలు పూర్తిగా వ్యతిరేకించారనే ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు. వెంటనే పరిశ్రమ ఏర్పాటును ఉపసంహరించుకుంటున్నామని ప్రకటన విడదల చేయాలని కోరారు. కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిలపక్షాల ఆధ్వర్యంలో పోరాట కార్యాచరణ రూపొందిస్తున్నామని, దశలవారీగా కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. సమావేశంలో నాయకులు ఊట్కూరి నర్సింహ, కందుల హన్మంతు, ఎండీ నాజర్, మిర్జా ఫజల్‌బేగ్, గూని రాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల హామీలు అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

రామన్నపేట, నవంబర్ 3 : ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ కార్మికుల మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా వారితో వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, కారోబార్‌లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాదె ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా నకిరేకంటి రాము, మహిళా కన్వీనర్‌గా కడారి భాగ్య, ఉపాధ్యక్షులుగా బొడ్డు రమేశ్, గాదో యాదయ్య, బూడిద మారయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బందెల భిక్షం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.

ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 3 : రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మున్సిపాలిటీలో పీఏసీఎస్, పెద్దగూడెంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించాలని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు డబ్బులు రావడం లేదని తెలిపారు. గోదాం కోడ్ నెంబర్ ట్యాబ్‌లో ఎంట్రీ చేయకపోవడం వల్ల జాప్యం జరుగుతుందని, వెంటనే ఎంట్రీ చేయాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పోచంపల్లి జూలూరు కొనుగోలు కేంద్రంలో లైట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈకి సూచించారు. పట్టణంలోని కొనుగోలు కేంద్రంలో 191 ధాన్యం రాసులు ఉన్నాయని, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కాంటా వేయడంలో జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పోచంపల్లి కొనుగోలు కేంద్రంలో తాత్కాలికంగా లైట్ ఏర్పాటు చేయాలన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, హమాలీలు సహకరిస్తే రాత్రి వేళల్లో ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమని, 51 మిల్లుల్లో ధాన్యం దిగుమతికి అవకాశముందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు 48 గంటల్లో డబ్బులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. అనంతరం ఎస్సీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ గదులు, విద్యార్థుల బెడ్రూమ్‌లను పరిశీలించారు. గదుల్లో దుర్వాసన వస్తుందని, శుభ్రం చేయాలని వార్డెన్ చంద్రకళను ఆదేశించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత, ఏడీఏ వెంకటేశ్వర్లు, తాసీల్దార్ ఎం.మహేందర్‌రెడ్డి, ఏఓ శైలజ, నాయబ్ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అందెల లింగంయాదవ్, సీఈఓలు సద్దిపల్లి బాల్‌రెడ్డి, నర్సింహ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

యాదగిరిగుట్ట, నవంబర్ 3 : రైలు కింద పడి ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తాళ్లగూడెం గ్రామ పరిధిలోని రైల్వే ట్రాక్ వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగూడెం గ్రామానికి చెందిన సూదగాని చరణ్ కల్యాణ్ (17) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన చరణ్‌ను తిరిగి కాలేజీకి వెళ్లాలని తల్లిదండ్రులు సూచించారు. తనకు చదువుకోవడం ఇష్టం లేదని వాదనకు దిగగా తల్లిదండ్రులు మందలించారు. దాంతో మనస్థాపం చెందిన అతను సమీపంలోని రైల్వే పట్టాల వద్దకు చేరుకుని సికింద్రాబాద్ – కాజీపేట దిగువ లైన్‌పై అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చౌటుప్పల్, నవంబర్ 3 : మండలంలోని దండు మల్కాపురం వద్ద 65వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లగిరి గ్రామానికి చెందిన కొలుకులపల్లి రామ్‌చరణ్ అలియాస్ చింటు (16) ఇద్దరు స్నేహితులతో కలిసి శనివారం రాత్ర పని నిమిత్తం బైక్‌పై తూఫ్రాన్‌పేటకు వెళ్తున్నారు. మార్గమధ్యలో ఓ ప్రైవేటు బస్సు అతివేగంతో వెనుక నుంచి వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామ్‌చరణ్‌ను స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మైరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ప్రవీణ్‌కుమార్‌కు బెస్ట్ సోషల్ సర్వీసెస్ జాతీయ అవార్డు

రాజాపేట, నవంబర్ 3 : మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్ బెస్ట్ సోషల్ సర్వీసెస్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. డిసెంబర్ 8న రవీంద్రభారతిలో వల్లూరి ఫౌండేషన్ వారు అవార్డును ప్రదానం చేయనున్నారు. రెండు దశాబ్దాలుగా చేసిన నిస్వార్థ సేవకు ఈ అవార్డు దక్కిందని ప్రవీణ్ పేర్కొన్నారు. వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ వల్లూరి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేందర్‌గుప్తా

ఆత్మకూరు(ఎం), నవంబర్ 3 : ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కొడిత్యాల నరేందర్‌గుప్తా ఎన్నికయ్యారు. భువనగిరిలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పోలిశెట్టి నర్సయ్యగుప్తా, సహాయ కార్యదర్శిగా రమేశ్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా రావుల వెంకన్న, కార్యదర్శిగా శ్రీహరి ఎన్నికయ్యారు.

యాదవ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్

తుర్కపల్లి, నవంబర్ 3 : శ్రీకృష్ణ యాదవ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని రుస్తాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు ర్యాకల రమేశ్‌యాదవ్ ఎన్నికయ్యారు. భువనగిరిలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మూసీ ప్రాంత ప్రక్షాళనపై చర్యలేవి?

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

బీబీనగర్, నవంబర్ 3 : జిల్లాలోని మేజర్ మండలాల్లో ప్రవహిస్తున్న మూసీ ప్రక్షాళనకు, కాలుష్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నదో.. ఎన్ని నిధులు కేటాయించారో బహిరంగంగా తెలియజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని షాదీఖానాలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. మూసీ సుందరీకరణ, ప్రక్షాళన గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. యాదాద్రి జిల్లా ప్రాంతం గురించి ఇప్పటివరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ఈ ప్రాంతంలో మూసీ జల కాలుష్యంతో పండిన పంటలు, మత్స్య సంపద విషమంగా మారుతున్నాయని, ఈ ప్రాంత ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని మూసీ ప్రాంతంలో ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని, వ్యర్థాలు మూసీలో కలవకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మూసీ ప్రాంతాన్ని స్పెషల్ జోన్‌గా గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీబీనగర్ పారిశ్రామిక ప్రాంతం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నదన్నారు. ఎయిమ్స్ దవాఖానకు సరైన నిధులు కేటాయించి అన్ని రకాల వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, నాయకులు ఈర్లపల్లి ముత్యాలు, గాడి శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, యాదమ్మ, చింతల సుబ్బారెడ్డి, బాలబోయిన జంగయ్య, ఈశ్వర్, సతీశ్, శివకుమార్, బాబు, చిన్న మల్లేశం, కిరణ్, సతీశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

5న ఇందిరా పార్కు వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్

భువనగిరి అర్బన్, నవంబర్ 3 : ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేక వారి కుటుంబాలు గడవడం చాలా కష్టంగా మారిందన్నారు. రాష్ట్రం ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో కార్మికులకు ప్రతి నెలా రూ.10వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 2019 మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలని, ఆటోలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లించాలని, 50 సంవత్సరాలకు పైబడిన డ్రైవర్లకు పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గణబోయిన వెంకటేశ్ (రాణా), ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్, నాయకులు శోభన్‌బాబు, భూపాల్‌రెడ్డి, సుధామోహన్‌రెడ్డి, లక్ష్మణ్, శేఖర్, శ్రీహరి, వంశీ, జావీద్, సాయి, వినయ్ పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి : డీవైఎఫ్ఐ

మహాసభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

భువనగిరి అర్బన్, నవంబర్ 3 : ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆదివారం డీవైఎఫ్ఐ మండల మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలోని నిరుద్యోగులంతా ఎన్నో ఆశలతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు దాటినా హామీలు అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా యూత్ డిక్లరేషన్ అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఏదునూరి మల్లేశం, పల్లెర్ల అంజయ్య, దయ్యాల మల్లేశ్, ఎండీ సలీం, మధు, కనకరాజు, సురేశ్, శేఖర్, చాణిక్య పాల్గొన్నారు.

'9న సదర్ సమ్మేళన నాన్ని విజయవంతం చేయాలి'

స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు

భువనగిరి అర్బన్, నవంబర్ 3 : పట్టణంలో ఈ నెల 9న నిర్వహించే సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశ్ అన్నారు. పట్టణంలోని వినాయక చౌరస్తాలో నిర్వహించే సదర్ స్థలాన్ని ఆదివారం సంఘం సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు సమ్మేళనం 9న సాయంత్రం 6గంటలకు పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి వినాయక చౌరస్తా వరకు భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. యాదవ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బెల్లి చంద్రశేఖర్, సిరబోయిన మల్లేశం, వడిచర్ల కృష్ణయాదవ్, ఊదరి సతీశ్, సురేశ్, బాలనర్సింహ, రమేశ్, పాండు, ప్రవీణ్ పాల్గొన్నారు.

'కుల గణనలో మాదిగలు అప్రమత్తంగా ఉండాలి'

భువనగిరి అర్బన్, నవంబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనలో మాదిగలు అప్రమత్తంగా ఉండాలని, సమాచారం సరిగ్గా నింపుతున్నారా.. లేదా? అనేది జాగ్రత్తగా చూడాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్‌మాదిగ అన్నారు. పట్టణంలోని పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తామే అమలు చేస్తామని ప్రకటించిన మాటకు ముఖ్యమంత్రి కట్టుబడి ఉండి వర్గీకరణ ప్రక్రియలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు. ధర్మయుద్ధ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, నాయకులు సురుపంగ శివలింగం, భాస్కర్, కోళ్ల జహంగీర్, సాయి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సత్కారం

సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, నవంబర్ 3 : కార్తీక మాసం పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. అనంతరం ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. కులగణన ద్వారా బీసీ ప్రజలకు రాజకీయ రిజర్వేషన్‌లో న్యాయం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట నాయకులు ముకేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో నాణ్యత పాటించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

గౌరాయిపల్లిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్ 3 : నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని గౌరాయపల్లి, మాసాయిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోలు, చెల్లింపులకు సంబంధించిన వివరాలను, రిజిష్టర్లు, అన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలస్యం చేయకుండా ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం యాదగిరిగుట్ట మండలంలోని శివ పీబీ రైస్ మిల్లులో ధాన్యం దిగుమతులను పరిశీలించి జాప్యం లేకుండా చూడాలని మిల్లర్లను ఆదేశించారు. ఆయన వెంట భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, తాసీల్దార్ దేశ్యా నాయక్ పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

కొమురయ్య పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్ 3 : మున్సిపల్ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు తండ్రి కొమురయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కొమురయ్య పార్థివదేహంపై పూలమాల ఉంచి వివాళి అర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, మాజీ ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం

- ఎల్కట్రిసిటీ జిల్లా సర్కిల్ అధికారి సుధీర్‌కుమార్

వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ సర్కిల్ అధికారి సుధీర్‌కుమార్

భువనగిరి అర్బన్, నవంబర్ 3 : విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఎల్కట్రిసిటీ జిల్లా సర్కిల్ అధికారి సుధీర్‌కుమార్ అన్నారు. ప